
## పురుషులకు ప్రత్యేకం



# జవాబు

—బులుసు-జీ-ప్రకాష్

అబ్బాయి నాలుగో తరగతి కొచ్చాడు. పుస్తకాలన్నాడు. బట్టలన్నాడు. రెండో అమ్మాయి రిబ్బన్లూ పౌడర్లూ అంది. ఇహ చంటిది నరే సరి-లివర్‌క్యూర్లూ గ్రైప్‌వాటర్లూ అంది. వీళ్ళందరి కోరికలూ తీర్చలేని దేవుడు 'కామే'శ్వర్రావు!

చిన్న గుమస్తాగిరితో, చాలీచాలని జీతంతో సతమతమవుతున్న కామేశ్వర్రావుకి పైనవచ్చే మామూళ్ళేమీ లేవు.

తన అర్థాంగికి తనవాళ్ళు పెట్టినవి, వాళ్ళవాళ్ళు పెట్టినవి కొన్ని నగలుండేవి. అవి మంచుకొండవారి నగలకొట్లో మంచులా కరగిపోయాయి. అవి అమ్ముతున్నప్పుడల్లా కామేశ్వర్రావు అనుకుంటూండేవాడు-ఇలా ఎంతకాలం వస్తువులమ్ముకుంటూ జీవనం గడపడమా అని. ఎప్పటికైనా ఈ సుడుల కడలినుండి బయటపడడం అంటూవుందా? ఉన్న వస్తువులన్నీ అమ్ముకున్న తరువాత ఇహ అమ్మడానికి వస్తువులే లేకపోతే? ధర్మరాజులాగా భార్యను....శివశివా! ఇట్టి దురాలోచనలు తనకెందుకు కలుగుతున్నాయి? 'ఆనో భద్రా: క్రతవోయన్తు విశ్వత:' అనే ఉపనిషద్వాక్యం స్ఫురించింది. విశ్వం నలుదెసలనుండి మంచి ఆలోచనలే వచ్చుగాక అనుకున్నాడు. మంచి ఆలోచనలు రావాలనుకున్నంత మాత్రాన అవి వచ్చేస్తాయా? అది వట్టి ఆకాంక్ష మాత్రమే. సుఖంగా చిరకాలం ఎట్టి పొరపొచ్చాలూ లేకుండా జీవించమని నూతన వధూవరుల్ని పెళ్ళి పెద్దలందరూ ఆశీర్వదించారంటే-అది ఆ పెద్దల ఆకాంక్ష మాత్రమే. అలా ఆశీర్వదించబడిన వధూవరులలో వైధవ్యం అనుభవిస్తున్న వధువులులేరా? భార్యా విహీనులైన విధురులు లేరా? విడాకులపై సంతకాలు చేసినవారు లేరా? ఐతే అంత మాత్రాన వివాహసమయంలో విరిసి కురిసిన దీవెనల విరులు వాడిపోయినట్లేనా?

కానీ భవిష్యత్తుని గురించి అనవసరంగా ఆలోచనలు పెట్టుకుని వర్తమానాన్ని వ్యర్థం చేయడం ఎందుకు?

అని మనసు, సమాధాన పరచేది కామేశ్వర్రావుకి.

భార్య చెవులకున్న జుంకాలనిమ్మని అడగాలను కున్నాడు కామేశ్వర్రావు. ఇంతకుముందు ఆమెకుగల గొలుసులూ గాజులూ అడిగినప్పుడు తీవ్రమైన ప్రతి ఘటన ఎదుర్కొనేవాడు. ఉభయులకూ వాగ్యుద్ధం అయిన తరువాత, ఎట్టకేలకు ఎలాగో సణుకుంటూ ఇచ్చేది నగలు. ఈ గొడవలన్నీ జ్ఞప్తికి రాగానే, ఇక భార్యనేమీ అడగకూడదనుకున్నాడు. ఆఫీసుద్వారా తనకు ప్రభుత్వం యిచ్చే అప్పులేవైనా వున్నాయా అని ఆలోచించుకున్నాడు. ఎంత చించుకున్నా ఏమీ స్ఫురించడం లేదు. ప్రావిడెంట్ ఫండునుండి ఎంత రుణం యిస్తారో అంతా 'దారుణం'గా వాడేశాడు. పండుగల కోసం సంవత్సరానికోసారి అడ్వాన్సిస్తారు. అది గత డిశంబరులో క్రిస్మస్‌కే వుచ్చేసుకున్నాడు. ఇహ ఏప్రిల్‌లో అందుతుందనుకున్న పదిహేనురోజుల సరెండర్ లీవ్ సేలరీ బిల్లు ట్రెజరీలో నిద్రిస్తోంది.

మోపెడ్ వుండడంవలన ఉద్యోగ నిర్వహణ సమర్థవంతంగా చేస్తాడని తన మీద ఉన్నతాధికారి సర్టిఫైచేస్తే, మోపెడ్ కొనుక్కుందికి, దాని విలువ ఎంతైతే అన్నిరూపాయలు అడ్వాన్సిస్తారు. కామేశ్వ ర్రావు ఆ డబ్బుకూడా వాడేసుకున్నాడు. ద్విచక్రవాహనం కొనలేదుగాని ద్విపాదపశువుగానే ఆఫీసుకొస్తున్నాడు. ఈ కోతలన్నీపోగా చేతికొచ్చేది బహుస్వల్పం.

ఒక మిత్రశ్రీని అప్పిమ్మని అడగడానికి బయలు దేరేడు. గుమ్మం దిగగానే ఒక వితంతువు ఎదురైంది; గంగా భాగీరథీ సమానురాలు. ఒకసారి విఘ్నేశ్వరుణ్ని స్మరించి రెండు నిమిషాలు ఆగాడు.

చాలామందికి ఇదో మూఢవిశ్వాసం! బయలుదేరే వేళకి విధవావిడ ఎదురవడం అపశకునంట! మరి ఆమె బయలు దేరేముందు ఏ దౌర్భాగ్యుని ముఖం చూడ్డంవల్ల ధవుని కోల్పోయినట్టు? ఆ దౌర్భాగ్యుడు కామేశ్వర్రావే కాకూడదూ?

ఇంతకీ మన సామాజిక వ్యవస్థలో వితంతువుకి అత్యున్నతస్థానం కల్పించారు. పుణ్యస్త్రీ, ముత్తైదువ వనస్త్రీకి సైతం అంత మహోన్నత స్థానంలేదు. ప్రజల అజ్ఞానంచేత పేరంటానికిగాని, శుభకార్యాలకు గాని వితంతువులను ఆహ్వానించరు. కారణం, పుణ్య స్త్రీ అయితే మహాలక్ష్మీ సమానురాలేనట! మరి గంగా భాగీరథీ సమానురాల్ని ఆహ్వానించడం వలన నష్ట మేమిటి? భాగీరథీగంగకు భర్తలేడా? సకల చరాచర సృష్టికర్త అయిన సదాశివుడు ఆమెకు భర్తకాడా? లోకంలో ఎన్నో కుట్రలూ కుచ్చితాలూ చేసి పాప పంకిలమైన మానవులను నదీరూపంలోవున్న తనయందు స్నానమాడితే సర్వకలుషాలను ఆ మహాసాధ్వి హరించివేస్తుందని నమ్ముతున్నామే! గంగా నదిలో స్నానం చేయలేనివారు, ఆమెను స్మరించినంత మాత్రాన పాపాలను పరిహరించి వేస్తుందని పురాణాలు ఘోషించలేదా? పవిత్ర భారతావనిలో గల నదులన్నిటిలో ప్రథమస్థానం ఏ నదీమతల్లికి కల్పించారు? సకల తీర్థాలమయమే కదా భాగీరథీగంగ? 'సర్వతీర్థమయీ గంగా' అని నుడువబడలేదూ?

"డబ్బు పాపిష్టిది" అని ఏ మహానుభావులు వలికారో, వారే- మహాలక్ష్మి గొప్పదనుకుని, ఆమెకు ప్రథమస్థానమిచ్చి శుభకార్యాలకు ఆహ్వానిస్తారు. మహాలక్ష్మిని ఆహ్వానించడం అంటే, పాపిష్టిదాన్ని ఆహ్వానించడంకాదా? మహాలక్ష్మీరూపమైన ధనాన్ని పాపిష్టిదాంతో ఉపమించినవారు, గంగాభాగీరథిని పాపిష్టిదాంతో ఉపమించగలిగేరా? పైగా పాపిష్టివాళ్లనే పునీతుల్ని చేసే మహాసాధ్వి ఆమె!



బాల నర్తకి

ప్రవల్లిక

జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యాన కాకినాడ సూర్య కళా మందిరంలో ఇటీవల బేబి ప్రవల్లిక నాట్య ప్రదర్శన జరిగింది.

ఆంధ్ర నాట్యం రీతిలో 'రా రా మా ఇంటికి' అభినయించి, ప్రవల్లిక తిల్లానా, నాట్య రూపాన్ని ప్రదర్శించింది. 'అదిగో అల్లదిగో శ్రీహరి వాసము' అన్నమాచార్య కీర్తనకు చక్కని భావాన్ని ప్రదర్శించింది ప్రవల్లిక.

కాకినాడలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.ఎస్. కమలేంద్రనాథ్ కుమార్తె అయిన ప్రవల్లిక ఇంత వరకు 16 నాట్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల ప్రశంసల నందుకున్నది.

శ్రీ వి.ఎస్. వరప్రసాద్ శిష్యురాలయిన ప్రవల్లిక కాకినాడ ఆశ్రమ్ పబ్లిక్ స్కూలులో నాల్గవ తరగతి చదువుతున్నది.

—మీరా. వై.

కామేశ్వర్రావు, తను అప్పడుగుదామనుకున్న మిత్రుని కలిశాడు. సమాధానం లాకేత్యం దాక్కొమ్మాను!

"నేనప్పుడే అనుకున్నాను. బయలుదేరినప్పుడు విధవావిడ ఎదురవడంతోనే ఇలా జరుగుతుందను కున్నాను" అనుకుంటూ తిరుగుముఖం పట్టేడు కామేశ్వ ర్రావు.

ఎలాగో బితుకుబితుకుమంటూ ఇల్లు చేరేడు. గృహిణి అయిన మధువ్రత మొహం చూడ్డానికి సిగ్గేసింది.

"చాలా చోట్లకి తిరిగేను మధువ్రతా! ఎక్కడా అప్పుపుట్టలేదు. చిట్టితల్లికి టానిక్కు కొనలేకపోయాను." అన్నాడు గోడవైపు మొహంపెట్టి.

"పోనీండి. జరిగిందేదో జరిగిపోయింది. నాచెవుల కున్న జుంకాలు రెండూ అమ్మేయండి" అని జుంకాలు రెండూ చెవులనుండి విప్పింది మధువ్రత.

కామేశ్వర్రావు స్తబ్ధుడైపోయాడు!

ఎప్పుడైనా తాను మధువ్రత నగలు అమ్మదలచి నట్టు అభివ్యక్తీకరిస్తే తన గృహసీమ ఇండో-పాకిస్తాన్ కదనరంగం అవుతూండేది!

కామేశ్వర్రావు తన బాల్యాన్ని ఒక్కసారి ఫ్లాష్‌బాక్‌లో చూశాడు.

మధువ్రత, తాను, ఆటలాడుకొంటున్న రోజులవి. మధువ్రత ఒక బొమ్మను తెచ్చి,బొట్టూ కాటుకాపెట్టి, చీరకట్టి పెళ్ళికూతుర్ని చేసింది. కామేశ్వర్రావు సహజంగా మంకుపట్టు గలవాడు కావడంవల్ల-మధువ్రత చేసిన పెళ్ళి కూతురుబొమ్మ తనదని చేతిలోంచి లాక్కోబోయాడు. తన బొమ్మను లాక్కుంటే మధువ్రత మాత్రం ఊరుకుంటుందా?

"ఇది నాబొమ్మ. నువ్వెవడివిరా లాక్కుందికి? మా నాన్నారితో చెప్తాను." అని గట్టిగా పట్టుకుంది బొమ్మని. "నీదికాదు నాదీ! నువ్వు మీ నాన్నతో చెప్తే, నేను మా నాన్నతో చెప్పలేనా?" అంటూ పెనగులాడేడు కామేశ్వర్రావు.

మధువ్రత చేతిలోంచి బొమ్మ జారి కిందపడి పోయింది. ఇద్దరి పెనగులాట ఒకరి జుత్తు ఒకరు పట్టుకోడంవరకూ వచ్చింది. అప్పుడే మధువ్రత చెవులకి కామేశ్వర్రావు చేతులు తగిలి, జుంకాలు పీకినట్లయి చెవులకున్న రంధ్రాలనుండి రక్తం స్రవించింది. మధువ్రత బావురుమని ఏడుస్తూ "వెధవా! నా జుంకాలు నిన్నేం చేశాయిరా ఊడబెరికేవ్ కదా? కావలిస్తే నా బొమ్మ తీసుకో!" అంది.

"జుంకాలు తీసికెళ్ళరేమిటండీ? ఏమిటా ఆలోచన?" అంది మధువ్రత. కామేశ్వర్రావు ఈ లోకంలో పడ్డాడు. చిరునవ్వు నవ్వేడు.

"ఏంలేదు మధువ్రతా! మన చిన్ననాటి ఆట జ్ఞప్తికొచ్చింది. చిన్నప్పుడు నువ్వూనేను ఒక ఆటబొమ్మ కోసం పెనగులాడినప్పుడు, నేను నీ చెవులను లాగడం, నీ చెవిరంధ్రాలనుండి రక్తం స్రవించడం, నువ్వు భోరున ఏడుస్తూ-'వెధవా! నా జుంకాలు నిన్నేం చేశాయిరా ఊడబెరికావుకదా' అని నన్ను నువ్వు తిట్టడం జ్ఞాపకం వుందా?

"-బాల్యంలో ఏ మధువ్రత తన జుంకాలు కదిలి రక్తం స్రవించడంవల్ల ఏడుస్తూ నన్ను మంద లించిందో, అదే మధువ్రత-నేడు తన స్వహస్తాలతో తన జుంకాలనే గృహావసరానికై విక్రయించమని ప్రేమతో అందిస్తోంది" అంటూ ఆనందాశ్రువులతో మధువ్రతను కౌగిలించుకున్నాడు కామేశ్వర్రావు. □

స ల హా!

కొన్ని సమయాలలో నోరుమూసుకుని చేతకాని వాజమ్మలాగా వుండడమే మేలు! నోరు తెరచి మాట్లాడితే నిజంగా చేతకాని వాజమ్మ అయిపోవచ్చు!!

*

ప్రే ర ణ

కొంతమంది ప్రేరణ లభిస్తేనేకాని ఏ పనీ ప్రారంభించలేమంటారు. ప్రేరణ కోసం కాచుకొని వుండడం ఆ రూట్‌లో రాని బస్‌కోసం రోడ్డుమీదవున్న బస్‌స్టాప్‌లో నుంచుని ఎదురు చూడటం వంటిది.